# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి పట్టు వస్త్రాలు ఈరోజు సాయంత్రం సమర్పిస్తారు.**

2. **ప్రజా సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్నాయని కేంద్ర ఉక్కు పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు.**

3. **హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా బైక్ ర్యాలీని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు.**

4. **నిల్వ గిడ్డంగుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

==========================

ఆర్చరీ ప్రపంచకప్‌లో స్వర్ణ పతకం సాధించిన ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవరను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. జబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వారు స్పందిస్తూ... పట్టుదల, ఏకాగ్రత, కఠోర సాధనతో ధీరజ్ ఈ విజయం సాధించాడని పేర్కొన్నారు. విజయవాడ గ్రౌండ్ నుంచి ప్రపంచ వేదిక వరకు ధీరజ్ ప్రస్థానం కొనసాగిందని, రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచాడని వారు కొనియాడారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలకు నిన్న అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఈరోజు నుంచి 23వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు వైఖానస ఆగమ పద్ధతిలో అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి సేనాధిపతి శ్రీ విష్వక్ సేనులవారిని నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. ఇక ఈరోజు సాయంత్రం మీనలగ్నంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నారు.

-------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా

చంద్రబాబు నాయుడు ఈరోజు తిరుమలలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఈరోజు సాయంత్రం తిరుమలకు చేరుకుని బేడి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం పెద్దశేష వాహనసేవలో పాల్గొంటారు. రేపు ఉదయం తిరుమలలోని పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఈవీ బస్సులను ప్రారంభిస్తారు. అలాగే ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు.

---------------------------

ప్రజా సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్నాయని కేంద్ర ఉక్కు పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఒక వీడియో సందేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులకు కొత్త పింఛన్ల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. కొత్త పింఛన్ల కోసం ఈనెల 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

దక్షిణాఫ్రికాలోని డర్బన్ ఇనందలో ఉన్న ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌లో మహాత్మా గాంధీ, కస్తూర్బా గాంధీల నివాసమైన సర్వోదయ హౌస్‌ను ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సందర్శించి నివాళు లర్పించారు. అలాగే దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటానికి వేదికగా నిలిచిన 'ఇండియన్ ఒపీనియన్' పత్రికను ముద్రించిన ప్రింటింగ్ ప్రెస్‌ను కూడా శాసనసభాపతి సందర్శించారు. ఈ సందర్భంగా... ఫీనిక్స్ సెటిల్‌మెంట్, పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వే స్టేషన్ పరిరక్షణ పనులు, భారత్, దక్షిణాఫ్రికా మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాల బలోపేతంపై చర్చించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఫీనిక్స్ సెటిల్‌మెంట్ సత్యాగ్రహ జన్మస్థలానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. సత్యం, అహింస సిద్ధాంతాలను మహాత్మాగాంధీ ఇక్కడే మానవాళికి అందించారని పేర్కొన్నారు.

---------------------------

హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఈరోజు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళల బైక్ ర్యాలీని కిషన్‌రెడ్డి ఈరోజు జెండా ఊపి ప్రారంభిస్తారు. మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ర్యాలీని నిర్వహిస్తున్నారు. కాగా, ఈ నెల 17వ తేదీన హైదరాబాద్ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హాజరుకానున్న నేపథ్యంలో, కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈరోజు పరిశీలిస్తారు. అధికారులతో సమావేశమై భద్రత, వేదిక, ఇతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని గనులు భూగర్భ వనరుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మంగినపూడి సముద్రతీరం వద్ద ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..25.. సెకన్లు

మరోవైపు.. మచిలీపట్నంలోని మంగినపూడిలో ఏర్పాటు చేసిన మహా గణపతిని రాష్ట్ర గవర్నర్ ఎస్. జబ్దుల్ నజీర్ ఈరోజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ గిడ్డంగుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలంలో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులతో పాటు, పంట నిల్వ గిడ్డంగుల నిర్మాణ పనులను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజాసేవ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో ప్రజలు భాగస్వాములు కావాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా విడుదల చేసిన సందేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ సేవలో మరిన్ని సంవత్సరాలు కొనసాగాలని ప్రధానమంత్రి జన్మదినమైన ఈ నెల 17వ తేదీన సాయంత్రం ప్రతి ఇంట్లో 'ఆశీస్సుల దీపం' వెలిగించాలని కోరారు. సేవా భావంతో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని ఆయన సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో వినాయక చవితి సందర్భంగా 16 వేల మొక్కలతో రూపొందించిన సస్య గణపతి విగ్రహాన్ని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు నిన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కలతో రూపొందించిన సస్య గణపతి విగ్రహం ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. దీనికి సంబంధించిన గుర్తింపు పత్రాన్ని గవర్నర్ ఆలయ కమిటీకి అందజేశారు.

---------------------------

తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి విస్తరించడంతో పాటు ఒడిశా-బెంగాల్ తీరాల మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో ఈరోజు, రేపు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

మరో వైపు తెలంగాణలో ఈరోజు తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================